# జ్ఞాపకార్థం

మేం మీమధ్య హైదరాబాద్ వెళ్ళాం. విశాలాంధ్ర విషయమైగానీ, సారస్వత సభల కోసమనిగానీ అనుకోనేరు, అదేమీకాదు. మా జానకీ, రామ్మూర్తీ అక్కడ వున్నారు. వాళ్ళని చూసేందుకు వెళ్ళాం.

జానకి ఎవరని అడుగుతారా? శాంతాదేవి పినతల్లి కూతురు. ఇంచుమించు శాంత ఈడుదే. ఆమెభర్త రామ్మూర్తీ నేనూ, ఒకే కాలేజీలో బి. యె. చదవడమే గాకుండా, ఒకే హాస్టల్‌లో, ఒకే బ్లాకులో వుండేవాళ్ళం. ఐదునెలల క్రితం వాళ్ళు తిరుపతి వెళ్తూ మద్రాసులో దిగి, రెండురోజుల పాటు మా యింట్లో వుండి, హైదరాబాద్ ఒకసారి రావలసిందని మరీ మరీ చెప్పారు. వస్తూ పోతూ వుండే బంధుత్వాలు—అని రామ్మూర్తి కూడా అన్నాడు.

శాంతాదేవి బంధుప్రేమగలమనిషిగనక, అవకాశం దొరకగానే నాచేత సెలవు పెట్టించి, హైదరాబాదు రైలు ఎక్కించింది. పనిలో పని అజంతా ఎల్లోరాలు కూడా చూసుకువద్దామని మాకు మనసులో లేకపోలేదు. కాని, అక్కడికి వెళ్ళాక పరిస్థితులని బట్టి ఆలోచించుకోవచ్చుననుకున్నాం.

మేము రైలుదిగి వాళ్ళయింటికి వెళ్ళేటప్పటికి వాళ్ళు ఎంత సంతోషించారో చెప్పలేం. బంధుత్వానికి బంధుత్వం,

స్నేహితానికి స్నేహం–రెండూ వున్నాయి వారి ఆతిథ్య గౌరవంలో.

మర్నాడు ఆదివారమవడంవల్ల భార్యాభర్తలిద్దరూ మాకు నగరం యావత్తూ చూపించారు. హైదరాబాద్ సికింద్రాబాద్ నగరాలకి మధ్యనున్న సరస్సు, పబ్లిక్ గార్డెన్సు, సలార్ జంగ్ మ్యూజియమ్, చార్ మినార్, ఇండియా కాఫీహవుస్ యిత్యాదులన్నీ నేత్రపర్వంగా చూశాం.

"ఈ రోడ్లనీ, డబుల్ డెకర్సనీ మన మద్రాసు తీసుకు పోతే బావుండును." అంది శాంతాదేవి.

నా అభిప్రాయమూ అంతేనని చెప్పాను.

"మెరీనా మాకు లేదుగా! మీ మెరీనా మా కిచ్చేసి, యివి తీసుకుపోండి–మా కభ్యంతరం లేదు," అన్నారు. హైదరాబాదీయులైన జానకీరామమూర్తులు.

రామమూర్తి సోమవారం పదిగంటలకల్లా భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళాడు. సాయంత్రం అయిదింటికి వచ్చి మమ్మల్ని సినీమాకి తీసుకువెళ్తానన్నాడు.

"ఏమండీ మీ వూళ్ళో కుర్చీసీట్లు తెరకిదగ్గిరగానూ నేల సీట్లు తెరకి దూరంగానూ వుంటాయిటగాదూ?" అని అడిగింది శాంతాదేవి.

"సాయంత్రం చూస్తారుగా!" అంటూ హేటు బోర్లించుకు తొందర తొందరగా వెళ్ళిపోయాడు రామమూర్తి.

పదకొండు గంటలకి యింట్లో మిగిలిన ముగ్గురి భోజనాలూ అయ్యాయి. నాకేమీ తోచడం లేదు. బడి మానేసిన కుర్రవాని స్థితిలా వుంది నా పరిస్థితి. వరసకి మరదలైన జానకి నా అవస్థ కనిపెట్టి. "బావగారూ, కారమ్స్ ఆడదామా ?" అంది.

"బోర్డు వుందని చెప్పావు కాదేం! పట్టుకురా" అంది శాంతాదేవి.

వాళ్ళింట్లో లేదుబోర్డు - పక్కవాళ్ళింట్లోనుంచి పట్టుకు వచ్చింది. బోర్డుతోపాటు యిద్దరు ఆటకత్తెలు-అనగా కారమ్స్ ఆడే ఆడపిల్లలని—కూడా పట్టుకొచ్చింది.

ఇద్దరూ పది పదిహేనేళ్ళ పిల్లలు. ఒకమ్మాయి పేరు సావిత్రి శకుంతల. వారంరోజులు వాళ్ళింట్లో వున్నానన్నమాటేగాని ఎవరు సావిత్రో, ఎవరు శకుంతలో పోల్చుకోలేకపోయేవాణ్ణి. అపూర్వ సోదరీలలా ఉండేవారు యిద్దరూ.

చెప్పొచ్చే దేమిటంటే, వున్న వారంరోజులూ కారమ్సూ ప్లేయింగ్ కార్డ్సుతో పగలల్లా గడిచేది. సాయంత్రం రామ్మూర్తి వచ్చాక మమ్మల్నెక్కడికయినా తీసుకువెళ్తాండేవాడు. జానకీ శాంతాదేవీ నాలుగున్నరకే సాయంత్రపు వంట పూర్తిచేసి, అయిదయేటప్పటికి బట్టలుకూడా మార్చుకు రెడీగా ఉండేవారు షికారుకి.

ఏడురోజులు కాబోలు వున్నాం. ఏడురోజులూ ఏడు నిముషాల్లా గడచిపోయాయి. అజంతా ఎల్లోరాలు

చూడలేక పోయినందుకు మాకేమీ విచారం కలగ లేదు. ఎందుకంటే, టైము అంత వేగంగా పరిగెట్టింది. అదీగాక రామ్మూర్తికి సెలవు దొరికే సావకాశం లేక పోయింది. అజంతా ఎల్లోరాలు తను మరోకప్పుడు చూస్తా ననీ జానకిని కూడా మా వెంట తీసుకు వెళ్ళమనీ రామ్మూర్తి అన్నాడు—కాని మాకే మనస్కరించ లేదు. "ఇంక రాక నే పోతామా, మరోక సారి"—అని నేనూ శాంతా సరిపెట్టు కున్నాం.

రేపు రాత్రి మా ప్రయాణమనగా అంతకి క్రితం నాటి మధ్యాహ్నం రామ్మూర్తి అన్నాడు : 'మీరు వెళ్ళబోయే లోగా మన మొక ఫొటో తీయించుకోవాలి."

నాకు మొదట్లో వినిపించక, ఏమిటని రెట్టించాను.

"మనందరం కలిసి ఒక ఫొటో తీయించుకోవాలి."

నాకు అర్థం గాక, 'ఫొటో దేనికి ?' అన్నాను.

"ఫొటో ఎందుకేమిటి—ఉంటుంది. జ్ఞాపకార్థం."

అప్పటికీ నాకు అర్థం కాలేదు. కొన్ని నాకు అర్థం అవవు. అందుకని 'శాంతా' అని పిలిచాను.

రాణీవారు ప్రత్యక్షమయారు.

"ఈ మరిది ఏమిటో అంటున్నారు" అన్నాను రాణీ వారితో.

"మీరు వెళ్ళబోయేలోగా మనందరం కలిసి ఒకఫొటో తీయించుకోవాలి." అన్నాడు రామ్మూర్తి.

మనం నలుగురమే కాదు—సావిత్రీ, శకుంతలా కూడా వుండాలి మనతోబాటు,'' అంది శాంతాదేవి.

రామ్మూర్తి వీధిలోకి వెళ్ళాక, జానకికి వినపడకుండా, శాంతాదేవిని చెవిలో అడిగాను. 'ఫోటో ఎందుకు, శాంతా, చాదస్తంగాని !''

''చూడండి—ఎవరిపిచ్చి వాళ్ళ కానందము.''

''అది నిజమేలే !''

''జానకిని నాలుగురోజులబట్టీ వేపుకు తింటున్నాడట—అడుగు, అడుగు—అని.''

''అయితే ఈ సంగతి మరదలుగారికి ముందే తెలుసునన్నమాట.''

''ఆయనకి ఫోటోలంటే మహా సరదా. ప్రతి వాళ్ళతోటీ ఫోటోదిగి, ఆ కాపీ జాగర్తగా దాస్తాడట.''

''ఇదంతా నువ్వెప్పుడు తెలుసుకున్నావ్ ?''

''ఆ మాటా ఆ మాటా మీద జానకి చెప్పింది. మీరేదో గవర్నర్ అయినట్టు, ఆయనగారితో ఫోటో తీయించుకోవడమూ వొద్దా అన్నట్టు, పోజు పెడతారేమిటి ?''

''చూశావా—నీకు లోకువ నేను. ఈ మహాసమస్య అర్థం గాకనే దేవిగారిని పిలిచింది. నేను గవర్నర్‌ని అయినప్పుడు నువ్వు గవర్నెస్‌వి కాకపోవులే !''

''ఎంతమాట—ఎంతమాట. వాళ్ళు దగ్గిర పెట్టుకు మాట్లాడండి. మా వాళ్ళు మహాకావ్యాలు చెప్పించక

పోయినా ఆపాటి యింగ్లీషు చెప్పించారు లెండి. గవర్నెస్‌ని అయే ఖర్మం నాకేం!'' అంటూ, లేనికోపాన్ని కళ్ళలో నుంచి చెక్కిళ్ళమీనకి రాలుస్తూ తుర్రున జారుకుంది శాంతాదేవి.

సాయంత్రం అయిదుగంటలకి ఆఫీసునుంచి వస్తూవస్తూ ఫొటోగ్రాఫర్‌ని పట్టుకొచ్చాడు రామ్మూర్తి. ట్రయిపాడ్, నల్లముసుగు, కెమెరా మొదలుగాగల పరికరాలు చూసి ఆశ్చర్యబోయాను. సావిత్రీ శకుంతలలని వెంటబెట్టుకుని మేము నల్గురం ఏదైనా ఫొటో స్టుడియోకి వెళ్ళి, ఆ పని కాస్తా పూర్తిచేసుకు వస్తామని అనుకున్నాను గాని యిలాటి ఫొటోగ్రాఫర్ దర్శన మవుతాడని అనుకోలేదు. ఫ్లాష్ కెమెరాల కాలంలో యిదేమిటి?

"తొందరగా బట్టలు వేసుకోండి," అన్నాడు రామ్మూర్తి స్త్రీలని వుద్దేశించి.

"సిల్కుచీరె లయితేగాని బాగాపడవా? ఈ బట్టలు బాగానే వున్నాయి," అంది జానకి.

"ఛా-అలా అనకూడదు. నువ్వు ఆ కంచి చీరె కట్టుకో. నేను మధుర చీరె కట్టుకుంటాను," అని మరిదిని వెనకేసు కొచ్చింది శాంత.

సావిత్రీ శకుంతలలు మాత్రం నాలుగున్నరకే ముస్తాబై కూచున్నారు. పెండ్లి కావలసిన పిల్లలు పరాయి పెద్దమను షులు వున్న ఫొటోలో కనిపించడం మంచిది కాదేమోనని

వాళ్ళ పెద్దవాళ్ళు ప్రారంభంలో శంకించారు. కాని జానకీ శాంతాదేవీ 'ఏమీ ఫరవాలేదు' అని వాళ్ళకి నచ్చచెప్పిన మీదట అంగీకరించారు. 'ఈ ఫొటో చూపించి మీ పిల్లలకి పెళ్ళి సంబంధం కుదురుస్తాను—చూసుకోండి' అని కూడా శాంతాదేవి అందట.

ఫొటోలో దిగవలసిన వాళ్ళం ఆరుగురం. ఆరుగురం వరసని కుర్చీలు వేసుకు కూచుంటే ఫొటోలో చోటు వుండదని అన్నాడు ఫొటోలు ఎత్తే మనిషి. అంచేత సావిత్రీ శకుంతలలు నుంచోడానికి ఏర్పాటయింది. వాళ్ళు మొగ వాళ్ళ పక్కగా గాక ఆడవాళ్ళని ఆనుకు నుంచోవాలి. ఆపిల్లలు చాలా మంచివాళ్ళు—వాళ్ళకి ఆ పిచ్చి గొడవలు ఏమీ తెలియవు. కాని వాళ్ళ పెద్దవాళ్ళకోసమై ఈ ప్రారంభ జాగర్త తీసుకోవలసి వచ్చింది.

మొట్టమొదట నేను—చారల షర్టు తెల్ల పంచె వేసుకు; నా పక్క కుర్చీలో శ్రీమతి శాంతాదేవి—గొడ్లు లేవు గదా అన్న ధైర్యంతో పెట్టుకున్న గంపెడు పూలతోనూ; తర్వాత జానకి—మరదలు మాణిక్యం కాదుగాని మరదలు వరస; ఆ చివరని రామ్మూర్తి—బుష్‌షర్టూ తెల్ల ఫాంటూ వేసుకు.

''ఈ దంపతుల మధ్య నొకపిల్లనీ, ఆ దంపతుల మధ్య నొకపిల్లనీ నిలబెట్టండి—'' అన్నాడు ఫొటోగ్రాఫర్.

"అలా పనికిరాదు," అంది జానకి.

ఇద్దరు స్త్రీలమధ్యనే ఈ యిద్దరు పిల్లలని నిలబెడితే ఫొటోలో చోటుచాలదని తేల్చాడు ఫొటోగ్రాఫర్. మధ్య మధ్య ముసుగులో తలదూర్చి—'యిటు జరగండి. అటు జరగండి'—అనేవాడు. కుర్చీలు యిటూ అటూ జరిపే వాళ్ళం. వంకర వస్తోంది—అని లబోమనేవాడు ఫొటోగ్రాఫర్.

"ఆ యరేంజ్‌మెంట్ తర్వాత చూసుకుందాం. ముందు ముందు ఈ పిల్లలమాట ఏమిటి?" అన్నాను రామ్మూర్తితో.

"అవును-ముందు ఆ సంగతి ఆలోచించాలి," అన్నాడు రామ్మూర్తి.

ఆడవాళ్ళని అంటుతూ, మొగవాళ్ళకి దూరంగా ఈ సావిత్రీ శకుంతలలని ఎలా నిలబెట్టాలో పావుగంటసేపు ఆలో చించిన మీదట గాని మాకు తట్టలేదు. ఈ చివర నేనూ, ఆ చివర రామ్మూర్తీ కూచోడానికి బదులు చివరలని స్త్రీలని కూచోపెడితేసరి—అనుకున్నాం. రెండో చివర జానకి, జానకి పక్కగా రామ్మూర్తి, ఇప్పుడు సావిత్రీ శకుంతలలు చెరొకస్త్రీనీ ఆనుకు నుంచోవచ్చు. వాళ్ళ పట్టుపావడాలు కూడా చక్కగా పడతాయి ఫొటోలో.

ఏర్పాటులన్నీ అయాక ఫొటోగ్రాఫర్ వల్ల ముసుగులో దూరి, నా కుర్చీని కాస్త యిటుగా జరపమన్నాడు.

"ఫోటోలో కూడా యిలా మీదికి వొరిగి కూర్చోవాలా? కాస్త అటుగా జరగండి," అంది శాంతాదేవి.

అది కోపతాపాలకి టైము కాదు గనక, 'నేనేం చేసేది ఫోటోగ్రాఫర్ కి చెప్పు' అని సవినయంగా అన్నాను — ఆమె కళ్ళలో నా ఫోటో చూసుకుంటూ.

"తల కాస్త పైకి ఎత్తండి, సార్" అన్నాడు ఫోటోగ్రాఫర్.

అందరం మెడలు కొంగల్లా ఎత్తాం.

"వన్...టు...కెమెరా వంక చూడండి." అంటూ మమ్మల్ని ఫోటోకి తర్ఫీదు చేస్తూ, మళ్ళీ ముసుగులోకి దూరాడు ఫోటోగ్రాఫర్.

శాంతాదేవిని రహస్యంగా అడిగాను: 'నువ్వు ముసుగు దొంగ సినిమా చూశావా చిన్నప్పుడు?"

ఆమె ఫకాలున నవ్వింది. ఏమి ఉపద్రవం సంభవించిందా అని ఫోటోగ్రాఫర్ ముసుగులోనుంచి హడావిడిగా తల బయటికి తియ్యడంలో, అతని కళ్ళజోడు కాస్తా జారి నేల మీదపడింది. కళ్ళద్దాలు పగిలాయనుకున్నాను. కాని ఫోటో భాగ్యం నూరు రాసిపెట్టి వుండటం చేత అలాంటిది జరగలేదు.

ఎందుకు నవ్వావని జానకి అడగ్గా, సెంటురాసుకు ఫోటోకి కూచోడం గురించిన పేటెంట్ జోక్, శాంతాదేవి ఆమెకి చెప్పింది గాని, జానకి నమ్మినట్లు తోచదు. పిల్లలిద్దరూ నవ్వడమే కాకుండా నవ్వును కూడా నవ్వారు.

ఈ ఫొటో తియ్యడం ఆ బావిమీద ఏర్పాటుచేశారు. అప్పటికప్పుడే పశువులకాపరులు గొడ్లను యిండ్లకు మరల్చు చుండిరి; శకుంత సంతానములు తమ నిజ నివాసములను చేరుచుండెను, దినకరుడు పశ్చిమాంబుధిని గ్రుంకు సమయ మాయెను.

"సార్, రేపు పొద్దున్నే తీస్తాను. లైట్ చాలదు. ఇదిగో ఈ యరేంజిమెంట్లతో ఆలశ్యమయిపోయింది."

"ఎంతలైటు వుంటే, అంత లైటుతో తీసేద్దూ," అన్నాడు రామ్మూర్తి—అతనికూడా కాస్త విసుగు పెడుతున్నట్లుంది.

"నో, సార్, నో. ఫలానా ఫొటోగ్రాఫర్ తీసిన ఫొటో అంటే ఎంత అప్రతిష్ఠ. ఇప్పటికి మూడువేల ఫొటోలు ఎత్తాను—ఏ ఒక్కటీ చెడిపోలేదు. మనం పోతామ్. సార్, మనం పోయిన వెనక మిగిలేది మన మాట .." అంటూ అప్పుడు పోయాడు ఫొటోగ్రాఫర్.

అలాటి వాడితో వాదించి లాభంలేదని మర్నాటి పొద్దుటికి ఫొటో ప్రోగ్రామ్ వాయిదావేశాం. ప్రత్యూషపవనాలతోపాటు ఫొటోగ్రాఫర్ వచ్చి, సూర్యకిరణాలు నాలుగువైపులకి ప్రసరించక పూర్వమే మా ఫొటో ఎత్తాడు-పోనీ తీశాడందాం. ఎందుకయినా మంచిదని రెండు ప్లేట్లు ఎక్స్పోజ్ చేశాడు.

ఆ రాత్రి మేము బయలుదేరే వేళకి కాపీరా లేదు. రెండు మూడు రోజు లయాక పోస్టులో పంపుతామన్నాడు రామ్మూర్తి—కాని పంపలేదు. జానకిమాత్రం ప్రూఫ్ కాపీ 'బావ గారికి బహుమానం' అంటూ పంపింది.

ఆరుగురికి నలుగురే వున్నారు ఫోటోలో ఆ నలుగురూ అయినా పౌరాణికి చిత్రంలోని దేవతలు భూలోకంలోకి దిగుతున్నట్టుగా ఉన్నారు.

ఆ ఫోటోని చించేస్తానని శాంతాదేవి అంది. కాని నేను మాత్రం జాగర్త చేసి వుంచాను. ఎంతయినా జ్ఞాపకార్థం తీయించుకున్నది!!

——